
ప్రజాశక్తి

బుధవారం 10 జులై 2024 8 పేజీలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు







ఇసుక ఉచితం కాదు..!

- 50 శాతం రాయితీతోనే
- గత ప్రభుత్వంలో టన్ను రూ.723
- ప్రస్తుత ప్రభుత్వంలో రూ.370
- రవాణా ఛార్జీలు అదనంగా వసూలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ నూతన ఇసుక పాలసీ వినియోగదారులకు కాస్త ఊరట మాత్రమే ఇచ్చింది. ఈనెల 8 ఇసుక నూతన విధానం 2024ను అమల్లోకి తీసుకొచ్చింది. గత ప్రభుత్వంలో ఇసుక బంగారమే అయింది. ట్రాక్టర్ ఇసుక రూ.5వేలు, టిప్పర్ ఇసుక రూ.18 వేలు వరకు పలికింది. చంద్రబాబునాయుడు ఉచిత ఇసుక అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఇసుక ఉచితంగా ఇవ్వడం లేదు. కేవలం 50 శాతం రాయితీ మాత్రమే దక్కే అవకాశం ఉంది. గత ప్రభుత్వం టన్ను రూ.723 ఇస్తుండగా, ప్రస్తుతం దానిని రూ.370 తగ్గించారు. రవాణా ఛార్జీలు దూరాన్ని బట్టి నిర్ణయిస్తారు. ప్రభుత్వం నూతన ఇసుక పాలసీతో వినియోగదారులకు కొంత ఊరట లభించింది. ఈ విధానంపై వైసిపి నేతలు పెదవి విరుస్తున్నారు..



రాష్ట్ర ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ జిల్లాలోని వినియోగదారులకు కొంత ఉపశమనం కలిగింది. జిల్లాలో ఎనిమిది ఇసుక రీచ్‌లుండగా, దానిని ఐదు ఇసుక యార్డ్‌లుగా మార్పు చేశారు. మినగల్లు, వెంకటాచలం, పల్లిపాడు, మర్రిపాడు, కావలిలో ఏర్పాట్లు చేశారు. తాజాగా ప్రభుత్వం మర్రిపాడు, మినగల్లు, పల్లిపాడులో స్టాక్ యార్డ్ లుగా గుర్తించారు. రోజుకు ఒక వ్యక్తి 20

▶ 2లో

ఇసుక ఉచితం కాదు..!

(మొదటి పేజీ తరువాయి)

టన్నులు వరకు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు.గత వైసిపి ప్రభుత్వంలో ఇసుక బంగారమే అయింది. మర్రిపాడు స్టాక్ పాయింట్ నుంచి టన్ను రూ.723, మినగల్లు పాయింట్ నుంచి రూ.650 వసూలు చేసేవారు. దీంతోపాటు రవాణా ఛార్జీలు కలిపి ఒక ట్రాక్టర్ ఇసుక నెల్లూరు నగరానికి చేరడానికి రూ.5 వేలు, ఒక టిప్పర్ రూ.18 వేలు వరకు పలికింది. ఇసుక భారీగా పెరగడంతో నిర్మాణ రంగం కుదేలయ్యింది. భవన నిర్మాణ కార్మికులు పనుల్లేకుండా పోయాయి. ప్రస్తుతం విధానంతో టన్ను రూ.370 వరకు నిర్ణయించారు. ఒక ట్రాక్టర్‌కు నాలుగున్నర టన్నులు ఇసుక పడుతోంది. రూ.1665 ఖర్చు అవుతోంది. దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలు వెయ్యి వరకు అవుతాయి. ఒక ట్రాక్టర్ ఇసుక రవాణాతో కలిపి రూ.2500 నుంచి రూ.2700 వరకు ఖర్చు అవుతోంది. టిప్పర్ ఛార్జీలు అందుకు అనుగుణంగా ఉంటాయి. ప్రస్తుతం మూడు స్టాక్ పాయింట్లలో 1,75,301 టన్నులు ఇసుక అందు బాటులో ఉంది. మర్రిపాడులో 1.25 లక్షలు, మినగల్లులో 41,885 టన్నులు, పల్లిపాడులో 8,205 టన్నులు సిద్ధంగా ఉందని మైనింగ్ అధికారులు చెబుతున్నారు.

ఇసుక ఇలా తీసుకువచ్చు..!

రాష్ట్ర ప్రభుత్వ విధానంతో జిల్లాలో మూడు స్టాక్ పాయింట్లలో ఇసుక తీసుకోడానికి అవకాశం కల్పించారు. ప్రభుత్వానికి టన్నుకు రూ.370 చెల్లించాల్సి ఉంటుంది. రవాణా ఛార్జీలు దూరాన్ని బట్టి తీసుకుంటారు. ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి లాభమూ ఉండదని అధికారులు చెబుతున్నారు. స్టాక్ పాయింట్ వద్ద నగదు ఎవరికీ చెల్లించకూడదు. క్యూఆర్ కోడ్‌తో ఫోన్ పే, గుగూల్ పే మాత్రమే చెల్లించాలి. ప్రతి రోజూ ఒక్క వ్యక్తి 20 టన్నుల వరకు తీసుకునే అవకాశం కల్పించారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే తీసుకోవాలి. ప్రతి స్టాక్ పాయింట్ ఇన్‌ఛార్జ్‌గా తహశీల్దారును నియమించారు. రెవెన్యూ అధికారులు బాధ్యత వహిస్తారు. వాహనాలను వినియోగదారులే తీసుకోవాలి. గ్రామాల్లో ఉంటే వాగులు, వంకల్లోని ఇసుకను స్థానికులు వినియోగించుకోవచ్చు. వారికి ఎలాంటి రుసుమూ ఉండదు. ఇతర ప్రాంతాల వారు ఇసుక తీసుకోడానికి అవకాశం ఉండదు. ఇసుక విధానంలో స్థానికులు నదుల్లో తప్ప తమ ప్రాంతాల్లోని వాగులు, వంకల్లో తీసుకోడానికి మాత్రమే అవకాశం కల్పించారు. పెన్నా నది నుంచి స్టాక్ పాయింట్‌లకు ప్రభుత్వం తరలిస్తే అక్కడ నుంచి మాత్రమే ఇసుక రుసుము చెల్లించి తీసుకెళ్లాల్సివస్తుంది.

టన్ను రూ.370 చెల్లించాలి

ఇసుక యార్డ్‌ల నుంచి తీసుకోడానికి టన్నుకు రూ.370 చెల్లించాలని మైనింగ్ అధికారులు తెలిపారు. గతంలో టన్ను రూ.723 ఉంటే దానిని ప్రభుత్వం సగానికి తగ్గించిందన్నారు. రవాణా ఛార్జీలను ప్రభుత్వం నిర్ణయించిందని, దీని కన్నా ఎక్కువ తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగదు మొత్తం ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాలని, ఎక్కడా ఒక్క రూపాయి నగదు రూపంలో ఉండకూడదని తెలిపారు. ఏమైన సందేహాలుంటే టోల్ ఫ్రీ నెంబర్‌కు 0861-2943569, 1800-425,6034 ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.



ఇసుక రీచ్‌లో ఉన్న ట్రాక్టర్లు (ఫైల్)

పశుగ్రాసంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు

మండలంలోని కొండి కందుకూరులో రైతు సేవా కేంద్రం వద్ద పశు గ్రాస వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కందుకూరు పశు వైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ జె చంద్ర మోహన్ హాజరై రైతులకు మేలైన పశు గ్రాసం, సాగు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. మేలైన పశు గ్రాసం సాగు చేయడం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి తద్వారా పాడి పోషణ లాభదాయకంగా ఉంటుందని పశు పోషకులకు అవగాహన కలిపించారు. సూపర్ నేపియర్ బహు వార్షిక పశు గ్రాసం నీటి వసతి ఉన్న వాళ్లు నాటుకోవడం వల్ల ఒక హెక్టర్ కి 80 నుంచి 100 టన్నుల పశు గ్రాసం లభిస్తుందన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గడ్డి ఖత్తిరించే మిషన్ వాడటం వల్ల 10 నుండి 20 శాతం గడ్డి వృథా కాకుండా 5 నుండి 10 శాతం పాల దిగుబడి వస్తుందని తెలిపారు. కోవూరు పశు వైద్యులు డాక్టర్ యస్. సుధాకర్ సీసనల్ గా వచ్చే వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. పశు వైద్య సహాయకులు విజయం సాగర్, జయ సుహాస్, లోకేష్ కుమార్ రైతులు పాల్గొన్నారు. అనంతరం జిల్లలముడి గ్రామంలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ స్కీమ్ ద్వారా నిర్మితమవుతున్న బెజవాడ శ్రీను, గొర్రెల షెడ్‌ను పరిశీలించారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కోట వెంకట నరసింహాన్ని శ్రీ సత్య సాయి జ్యువెలర్స్ యజమాని కాకుమాని ప్రవీణ్ కుమార్ సోమవారం తన షాపులో ఘనంగా సన్మానించారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మంచి మనసు, సేవా భావం, అందరితో ఆప్యాయంగా ఉండే తత్వం, ప్రతి ఒక్కరినీ గౌరవించే విధానం ఉంటే అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని కోట నరసింహం నిరూపించాడని కొని యాడారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని అభివద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు. అమ్మవారి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించాలని ప్రవీణ్ కుమార్ కోరారు. తనను ఘనంగా సన్మానించిన కాకుమాని ప్రవీణ్ కుమార్‌కు ఆలయ ప్రెసిడెంట్ కోట వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. కందుకూరు నగర ఆర్యవైశ్యుల సహాయ సహకారంతో ఆలయాన్ని మరింతగా అభివద్ధి చేస్తానని నరసింహం తెలిపారు. మురారి శెట్టి సుధీర్ కుమార్, కోటా కిషోర్, మురారి శెట్టి వెంకటేష్, కొత్త సుబ్బారావు, కె వెంకటేశ్వర్లు ఉన్నారు.



కోట వెంకట నరసింహంను సన్మానిస్తున్న దృశ్యం

'ఉపాధి' పనులు ప్రారంభించాలి



గుడ్లూరులో వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-గుడ్లూరు

ఉపాధి పనులు వెంటనే ప్రారంభించి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం గుడ్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గుడ్లూరు మండల అభివద్ధి అధికారికి వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం మండలం లోని అన్ని గ్రామాలలో ఉపాధి పనులు ఆగిపోయాయన్నారు. దీనివల్ల వ్యవసాయ కూలీలు పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో పనిచేసిన మూడు వారాల డబ్బులు రాలేదు. పనిచేసిన డబ్బులు రాక, పని పెట్టక నానా ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి కూలీలు ఎండిఓ దష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎండిఓ బుధవారం నుండి పనులు ప్రారంభిస్తామని ,వెంటనే వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నేలటూరి తిరుపాలు, మల్లేశ్వరి, మంగమ్మ సుబ్బయ్య, సిఐటియు మండల కార్యదర్శి కొట్టే వెంకయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి దామా కిష్టయ్య, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు జి స్టాలిన్, డి సీతారాం పాల్గొన్నారు.

ఉలవపాడు : మండలంలో ఉపాధి పనులు వెంటనే ప్రారంభించి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఉలవపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉలవపాడు ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ బి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దువ్వూరి జాన్ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ఆగిపోయాయన్నారు. దీనివల్ల వ్యవసా య కూలీలు పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పనిచేసిన 4 వారాల కూలీల బిల్లులు నేటికి రాలేదని పేర్కొన్నారు. పనిచేసిన డబ్బులు రాక, అని పెట్టక నానా ఇబ్బందులు పడుతు న్నామ న్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని, ఫీల్డ్ అసిస్టెంట్ లేని చోట నియమించి వెంటనే ఉపాధి పనులను ప్రారంభించి కూలీలను ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జివిబి కుమార్, సిఐటియు ఉలవపాడు మండల నాయకులు ఎస్. డి జబీర్, డి కోటేశ్వరరావు, వహీద్ ఉన్నారు.

వలేటివారిపాలెం : ఉపాధి పనులు వెంటనే ప్రారంభించి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని,ఏ.పీ వ్యవసాయ కార్మిక సంఘం వలేటివారిపాలెం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎపిఒ ఆఫీస్ లోనే టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దువ్వూరి జాన్ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం మండలంలోని అన్నీ గ్రామాల్లో ఉపాధి పనులు నిలిచిపోయాయన్నారు. కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పనులు ప్రారంభించి కూలీలను ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం వలేటివారిపాలెం మండల అధ్యక్షులు మంగి.లాజర్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జివిబి కుమార్ ఉన్నారు.



ఉలవపాడులో..



పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు

చేయి చేయి కలుపుదాం.. ఆపదలో ఉన్నవారి అవసరాలను తీర్చుదాం.. అంట శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి ఆధ్వర్యంలో కీర్తిశేషులు చీదెళ్ల లక్ష్మయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు చీదెళ్ల ప్రసాద్, చీదెళ్లకష్ణ సహకారంతో పట్టణంలోని ఊరి బయట ఉన్న పేదలకు ఆహారం పంపిణీ చేశారు. స్వర్ణ స్వయంకషి మానసిక దివ్యాంగుల ఆశ్రమంలోని పిల్లలకు టవల్స్ , చాపలు పంపిణీ చేశారు. ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గో రవ్వా శ్రీనివాసులు , వాసవి క్లబ్ లెజెండ్స్ ప్రెసిడెంట్ ఇన్నమూరి శ్రీనివాసులు, చీదెళ్ల తారక్,చీదెళ్లమణికంఠ పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం

ప్రజాశక్తి-గుడ్లూరు

గుర్తు తెలియని యువకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు గుడ్లూరు ఎస్ఐ లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. గుడ్లూరు మండలం, శాంతి నగరం దగ్గర జాతీయ రహదారి పక్కన ఉన్న జామాయిల్ చెట్ల మధ్యలో గుర్తు తెలియని యువకుని మృతదేహాన్ని గురించిన సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృత దేహాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆకుపచ్చ టీ షర్టు అన్నయ్య జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు కందుకూరు డిఎస్‌పి శ్రీ శ్రీనివాసులు తెలిపారు. ఈ దుస్తులు ధరించిన యువకుడు కనిపించకపోతే గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వివరాలు తెలుసుకోవాలని సూచించారు.



పోకూరు జెడ్‌పి స్కూల్లో నిలిచిన వర్షపు నీరు

హైస్కూల్లో నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - వలేటివారిపాలెం

మండలంలోని పోకూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ ఆవరణలో చిన్నపాటి వర్షానికి వర్షపు నీరు నిలిచింది. నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎత్తు పెరగడం వల్ల స్కూలు డౌన్ అయింది. అందువల్ల వర్షానికి వచ్చిన నీళ్లు బయటకు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ఎక్కడ పడ్డ నీళ్లు అక్కడే నిలిచిపోయాయి.వర్షపునీరు నిలబడడం వల్ల దోమలు, క్రిమి కీటకాలు, విషపూరితమైన పురుగులు, విశ్వ జ్వరాలు సోకే అవకాశ ముందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు విద్యార్థులు, ఉపాధ్యా యులు సైకిళ్లుబైకులు రోడ్డుమీద పెట్టుకోవా ల్సిన పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు.

కోవూరులో పట్టపగలే దారుణ హత్య

పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి-కోవూరు
పట్టపగలు అందరు చూస్తుండగానే ఒకరిని అతిదారుణంగా పదునైన కత్తితో పొడిచి హత్య చేశారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కోవూరు మండల కేంద్రంలోని రాళ్లమిట్ట ప్రాంతంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మంగళవారం ఉదయం రాళ్లమిట్ట ప్రాంతంలో ఇరుగ్రూపులు ఘర్షణ చోటు చేసుకోగా ఆ ఘర్షణలో వెంకటేశ్వరపురం గాంధీ గిరిజన కాలనీకి చెందిన పెదాల నాగరాజు(25) అక్కడిక్కడే మతిచెందాడు. కోవూరు జంగంవీధి సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద పందులు పట్టేందుకు వెంకటేశ్వరపురం గాంధీ సంఘం ప్రాంతానికి చెందిన రమేష్, నాగరాజు, శ్రీను (అరవోడు) ముగ్గురు కలిసి వచ్చారు. ఆ విషయాన్ని కోవూరు రాళ్లమిట్టకు చెందిన హరి, శ్రీనివాసులు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యంలు, అడ్డుకొని కోవూరు బజారుసెంటర్‌కు తీసుకొచ్చారు. ఆ విషయాన్ని పందులు పెంపకం దారుల కులపెద్ద అయిన పెంచలయ్యకు సమాచారం ఇచ్చారు. మీ ప్రాంతానికి చెందిన వారు మా ఏరియాలో దొంగతనంగా పందులు పడుతున్నారని అందుకు మీరు వచ్చి మధ్యస్తం చేయాలని కోరారు. 5 గంటల సమయంలో పెంచలయ్య కోవూరు బజారు సెంటర్లో మధ్యస్తం చేస్తూ ఈ రోజు మాకు పోలేరమ్మ పొంగళ్లు ఉన్నాయని, అప్పటి వరకు నాగరాజు, సెల్‌ఫోన్, స్కూటీని మీ వద్ద పెట్టుకోవాలని చెప్పడం జరిగింది. అనంతరం 10.30గంటల సమయంలో గాంధీజన సంఘానికి చెందిన నాగరాజు, దుర్గయ్య (జుట్టోడు), కోటేశ్వరరావు (బొచ్చోడు)లు కలిసి కోవూరు రాళ్లమిట్టకు వచ్చారు. అక్కడ మన్నేపల్లి రామకృష్ణ ఇంటి ముందు నిలబడుకొని ఉన్న సమయంలో దుర్గయ్య రామకృష్ణను తొడపైన పదునైన కత్తితో పొడిచాడు.


మృతుడు నాగరాజు

వారిని అడ్డుకోబోయిన రాంభీని కూడా దుర్గయ్య పొడిచాడు. అదే సమయంలో నాగరాజు మధ్యలో చొరవ తీసుకొని ఎందుకు ఈ విధంగా ప్రవర్తిస్తున్నారో ఇది పద్ధతి కాదని అడ్డుతగిలాడు. దీంతో కోపం తెచ్చుకొన్న దుర్గయ్య, కోటేశ్వరరావు వాదోపవాదాలు చేసుకున్నారు. ఆ సమయంలో దుర్గయ్య దగ్గర ఉన్న పదునైన కత్తి నాగరాజుకు ఎడమఛాతి గుండెలో కత్తి గుచ్చుకుంది. దీంతో అక్కడిక్కడే నాగరాజు మతిచెందాడు. పోలీసులు రాకపోయి ఉంటే మరో కొన్ని ప్రాణాలు పోయేవి.హత్య జరిగిన ప్రాంతంలో ఇరుగ్రూపులు దాదాపు 60 మందికి పైగా చేరుకొని ఇళ్ల మధ్యకు వెళ్ళి ఘర్షణ వాతావరణం సృష్టించారు. అదే సమయంలో సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంగనాథగౌడ్లు తన సిబ్బందితో చేరుకొని అల్లరిమూకలను చెల్లాచెదురు చేశారు. విచక్షణ కోల్పోయి ఇరుగ్రూపుల వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ భయానిక వాతావరణాన్ని కల్పించారు. వారిని చెదరకొట్టేందుకు ప్రయత్నించారు. అప్పటికే గాయపడిన మన్నేపల్లి రామకృష్ణ రాంభీలను చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న రూరల్ డిఎస్‌పి శ్రీనివాసు లురెడ్డి, కోవూరు సిఐ శ్రీనివాసరావు, బాలాజీనగర్ సిఐ వీరనాయక్, నెల్లూరు టు టౌన్ సిఐ బాబి, ఎస్ఐ రంగనాథగౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలను పరిశీలించారు. మతుడికి భార్యతో పాటు నలుగురు పిల్లలు ఉన్నారు. తన భర్తను ఎవరు చంపారు నా బిడ్డలు నా తండ్రి ఎక్కడ అని అడిగితే ఏమి చెప్పాలో దిక్కుతోచని స్థితిలో మృతుని భార్య బిక్కుబిక్కుమంటూ రోధిస్తుంది. క్షణికావేశంలో చేసిన పొరపాట్లకు నిండు ప్రాణం బలైంది. ఏదైనా సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప హత్యలు చేసుకొనే వరకు రాకూడదని పోలీసు అధికారులు చెబుతున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

కోవూరు రాళ్లమిట్ట ప్రాంతంలో మంగళవారం ఉదయం హత్యకు గురైన నాగరాజును పొడిచిన విషయమై అనుమానితులుగా ఉన్న దుర్గయ్య (జుట్టో డు) కోటేశ్వరరావు (బొచ్చోడు)లు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. వీరిని పూర్తి స్థాయిలో విచారిస్తే హత్యకు గల కారణాలు తెలుస్తాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కావలి అభివృద్ధికి ఎంఎల్‌ఎ కృషి

ప్రజాశక్తి-కావలి: నూతనంగా గెలిచిన ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి కావలి అభివృద్ధికి కృషి చేయాలని కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు ఒక ప్రకటనలో కోరారు.వైకుంఠపురం వద్ద ఫ్లై ఓవర్, లేక అండర్ బ్రిడ్జి అత్యంత ప్రాధాన్యతతో పూర్తిచేయా లన్నారు. ట్రంక్ రోడ్డు విస్తరణ, రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్‌ల ఏర్పాటు, అధ్వాన్నంగా ఉన్న రైతుబజారును పక్కాగా నిర్మించడం, ఆటో స్టాండ్, ఫోర్ వీలర్స్‌కు పార్కింగ్ ప్లేస్ , తదితర సౌకర్యాలు కల్పించడం, రోడ్ల రిపేర్లు చేయాలన్నారు. ఎంఎల్‌ఎ క్రీడాస్టేడియం ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేయడం హర్షణీయమన్నారు. పొలాలు స్థలాల దురాక్రమణ, లేఅవుట్లుగా మార్చడాన్ని సరిదిద్దుతాననే మాటను ఆచరణయోగ్యం చేస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు సి.శారద, షేక్. ఫాతిమా, షేక్.నూర్జహాన్, టి.సుజాత, నాగమణి, అరుణ తదితరులు కోరారు.

తగిన సిబ్బందిని ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-నెల్లూరు :రూరల్ నియోజకవర్గ పరిధిలోని సబ్ స్టేషన్‌లలో తగిన విద్యుత్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి విద్యుత్ శాఖ ఎస్.ఇ. విజయన్ కి వినతి పత్రం అందజేశారు. మంగళవారం నగరంలోని విద్యుత్తు భవన్‌లో టిడిపి నాయకులు విద్యుత్ శాఖ ఎస్ఇ.ని కలిసి వినతి పత్రం అందజేశారు.


ఎస్ఇతో మాట్లాడుతున్న దృశ్యం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అనేక సబ్ స్టేషన్ లలో అసిస్టెంట్ లైన్ మెన్ లు, జూనియర్ లైన్ మెన్‌ల కొరత ఎక్కువగా ఉందన్నారు. దీంతో గ్రామాల్లో విద్యుత్ సేవల్లో లోపాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. తగిన విద్యుత్ సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో ములుమూడి సర్పంచ్ కుండా. కరుణాకర్, మండల కోఆప్షన్ మెంబర్ మీరా మొహిద్దీన్, టిడిపి నాయకులు అరవ శ్రీను, అట్ల నరసయ్య, సోడం భాస్కర్, అబ్దుల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎన్‌జిఒలు

కలెక్టర్‌ను కలిసిన ఎన్‌జిఒ నేతలు

ప్రజాశక్తి-నెల్లూరు:కలెక్టర్ ఆనంద్‌ను ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసిన ఎన్‌జిఒ సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమా లను ప్రజల చెంతకు తీసుకెళ్లేందుకు జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి పనిచేస్తామని కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు,జిల్లా కార్యదర్శి నాయుడు వెంకట స్వామి,ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, ఈదూరు కరుణమ్మ, సంయుక్త కార్యదర్శులు ఈదూరు విజయకుమార్, లక్కాకుల పెంచలయ్య, జి సువర్ణ, జిల్లా మహిళా చైర్ పర్సన్ ఉదయగిరి చిన్నమ్మ, నెల్లూరు తాలూక అధ్యక్షులు చిలక రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-నెల్లూరు: పెన్నా బ్యారేజీ ప్రాంతంలో ఓ యువకుడి మృత దేహం లభ్యమైంది. మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన నగరంలో కలకలం రేపింది. పెన్నా బ్యారేజీ ప్రాంతంలోని మృత దేహంపై పలు అనుమానాలు స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృత దేహం వద్ద దొరికిన సాక్ష్యాలను పరిశీలించగా బుచ్చిరెడ్డిపాళెం ప్రాంతానికి చెందిన శ్రీను అనే యువకుడిగా గుర్తించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో మృతుడు బుచ్చిరెడ్డిపాళెం మండలం, దామరమడుగు ప్రాంతానికి చెందిన కృష్ణయ్య అనే వ్యక్తి కుమారుడని నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది.ప్రమాదవశాత్తు మరణించాడా.. లేక ఎవరైనా చంపివేసి మృత దేహాన్ని ఈ ప్రాంతంలో వదలి వెళ్లారా అన్న కోణంలో పోలీసులు విచారణ సాగిస్తున్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-కావలి: డాక్టర్ రామ్ సెంటర్ జవహర్ భారతి విశ్వోదయ,పిహెచ్ సి ల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ పథకం కింద మంగళవారం వెంగళరావు నగర్ పి.హెచ్.సి.లో ఉచిత వైద్యశిబిరం జరిగింది.ఈ కార్య క్రమంలో పి.హెచ్. సి వైద్యులు డాక్టర్ రమ్య , డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర రెడ్డి , డైరెక్టర్ కూనం తాతిరెడ్డి , సామాజిక కార్యకర్త ఎం.మాల కొండారెడ్డి, సి ఒ ప్రసాద్ , సూపర్‌వైజర్ సుగుణమ్మ, సబ్ యూనిట్, ఆఫీసర్, కె.వెంకటరెడ్డి , ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కావలి:కావలి వెంగళరావు నగర్‌లో నివాసం ఉంటున్న షేక్. బాదుల్లా అనే ఆటో డ్రైవర్ కొంతకాలం క్రితం పక్షవాతానికి గురయ్యారు. ఇంటి పెద్ద మంచాన పడడంతో షేక్ బాదుల్లా వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొం టుంది. వారి ఆర్థిక స్థితిని తెలుసుకున్న సేవియర్ వాలంటరీ ఆర్గనైజేష న్ సభ్యులు మౌర్య, భార్గవ్, సుతేజ్ వెంటనే స్పందించి వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

వ్యర్థాల నుంచి సంపదను సృష్టించాలి

ప్రజాశక్తి-నెల్లూరు
జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తెలిపినట్లుగా వ్యర్థాల నుంచి సంపదను సృష్టించడం ఎలా అనే మార్గాలను అన్వేషించే భాగంలో నగరంలోని అల్లీపురం వద్ద గల డంపింగ్ యార్డ్‌ను దొంతాలిలో అటవీ ప్రాంతంలో ఉన్న 20 ఎకరాల డంపింగ్ యార్డును జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ సందర్శించారు. మంగళవారం డంపింగ్ యార్డులను సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చెత్తను


మాట్లాడుతున్న జనసేన నాయకులు

సేకరిస్తూ, సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో , దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్న వ్యక్తులు తమ భద్రతకు సరైన మాస్కులు, చేతులకు - కాళ్లకు గ్లౌజులు వేసుకుని ఆరోగ్యానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కార్మికులకు సూచన చేశారు. డంపింగ్ యార్డులల్లో పనిచేసుకుంటూ డిగ్నిటీ ఆఫ్ లేబర్ గా జీవించేందుకు, అదే విధంగా నిరుద్యోగ యువత చెత్తను రీసైక్లింగ్ చేసి ఎరువులుగా మార్చేందుకు, ఘన వ్యర్థాలను శుద్ధి చేసి మళ్లీ వినియోగించే ప్రక్రియ, శుద్ధి ప్లాంట్ల నిర్మాణంపై దృష్టిపెట్టాలని , "చెత్త నుంచి సంపద" సృష్టించాలని పిలుపునిచ్చారు..ఇందుకోసం ఒక ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల ప్రజలకు కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా డంప్‌యార్డు నిర్వహణ కూడా సులభతరం అవుతుందని పేర్కొన్నారు.

రొట్టెల పండుగకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-నెల్లూరు
నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండగ ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో దర్గా ప్రాంగణంలో జరుగుతున్న పనులను బారాషహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ చైర్మన్ షేక్ ఖాదర్ బాషా, సయ్యద్ సమీ, టిడిపి నేత సాబీర్ ఖాన్, షంషుద్దీన్ కమిటీ సభ్యులు పఠాన్ జాఫర్ ఖాన్, టిడిపి 36వ డివిజన్ నేత రసూల్ తదితరులు మంగళవారం పర్యవేక్షించారు. రొట్టెల పండుగకు సుమారు పది లక్షల పైగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో వారికి మౌలిక వసతులు కల్పించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.. భక్తులు ఎక్కడ ఇబ్బందులు పడకుండా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా కమిటీ సభ్యులు, టిడిపి నేతలు తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మంచినీటి వసతి, రాత్రి బస చేసేందుకు స్థలం, మరుగుదొడ్లు, మెడికల్ క్యాంపులు, ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నారు.

పేదలపై ఇసుక భారం పడకూడదు..

ప్రజాశక్తి-నెల్లూరు: పేదలపై ఇసుక భారం పడకూడదు పేదల సొంతింటి కల నెరవేరాలని చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోను అనుసరించి ఫ్రీ శ్యాండ్ పాలసీ అమలు చేస్తూ జీవో నెంబర్ 43 విడుదల చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి తెచ్చిన ఇసుకపాలసి వల్ల వేలాదిమంది భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పాలయ్యారు. వారం వారం తమ సెంట్రింగ్ సామాన్లు అమ్ముకొని జీవనం సాగించిన పరిస్థితులు చూశామన్నారు. పేదవాడు సొంతింటిని నిర్మించాలంటే ఇంటి ఖర్చు పది లక్షల అయితే అందులో ఇసుక ఖర్చే రెండు లక్షలు అయ్యేదన్నారు. ఫ్రీ శ్యాండ్ పాలసీ అమలుతో భవన నిర్మాణ కార్మికులు పేద బడుగు బలహీన వర్గాలు హర్షిస్తున్నారన్నారు. ఇసుక అందుబాటులో ఉండటం వల్ల ఇల్లు ఫ్యాక్టరీలు కట్టే వారిపై భారం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో నాలుగు నుంచి ఐదు వేలు అయ్యే ట్రాక్టర్ ఇసుక నేడు ఉచితంగా అందనుందన్నారు.



శ్వేతపత్రం అసత్యాల పుట్ట

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యుత్ రంగంపై చంద్రబాబు విడుదల చేసిన శ్వేత పత్రం అసత్యాల పుట్ట అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి హయాంలో విద్యుత్ రంగం అభివృద్ధి చెందనట్టుగా ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన టిడిపి నాయకులు కేవలం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని విమర్శించేందుకు అధిక సమయం కేటాయిస్తున్నారని ఆరోపించారు. శ్వేతపత్రం అంటే ఆయా రంగంలో ఉన్న పరిస్థితిని వివరించాలి.. కానీ ఆ సంప్రదాయానికి తిలోదకాలు ఇస్తూ వైసిపి ప్రభుత్వం పై విమర్శలు చేశారు. విద్యుత్ ఉత్పత్తిని బ్రహ్మాండంగా పెంచామని చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడం చూస్తే నవ్వు పుట్టిస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యుత్ డిమాండ్ 25శాతం పెరిగిందని, విద్యుత్ రంగంలో 4.7శాతం వృద్ధిరేటు నమోదైంది. జాతీయ సగటు కంటే ఇది అధికం మని గుర్తు చేశారు. చంద్రబాబు హాయంలో కేవలం 1.9శాతం మాత్రమే వృద్ధి రేటు ఉందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చంద్రబాబు ప్రస్తావించలేదని, చంద్రబాబువి అన్నీ అబద్ధాలే అన్నారు. విద్యుత్ రంగాన్ని అప్పుల కుప్పగా చేశారని ఆరోపించారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టినప్పుడు విద్యుత్ రంగా బకాయిలు రూ.29వేల 550.కోట్లుగా ఉన్నాయని, ఆయన దిగిపోయే నాటికి 2019 నాటికి ఆ బకాయిలు రూ.86వేల 215 కోట్లకు చేరాయన్నారు. డిస్కమ్‌లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోకుండా విద్యుత్ ఒప్పందాలను చంద్రబాబు చేసుకున్నారు.. ట్రూఅప్ ఛార్జిలు ఎత్తేస్తానని బాబు చెప్పగలరా అని ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా సోలార్ విద్యుత్ ధరలు తగ్గుముఖం పడితే.. రాష్ట్రంలో మాత్రం యూనిట్‌ను ఏడు రూపాయలకు కొనుగోలు చేసేలా చంద్రబాబు ఒప్పందం చేసుకున్నారన్నారు. ఇలాంటి నిర్ణయం వల్ల ఎంతో నష్టం జరిగిందని, రైతులకు సంబంధించి సబ్సిడీ బకాయిలు కూడా చెల్లించలేదన్నారు. ట్రూఅప్ ఛార్జీలు చంద్రబాబు హయాంలోనే వచ్చాయన్నారు. కానీ తనకు ఏమీ తెలియనట్టు చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పందంగా ఉందన్నారు. రైతులకు మీటర్లను పెట్టనివ్వబోమని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు చెప్పారని, ఇప్పుడు ఆ విషయాన్ని ప్రస్తావించకుండా దాట వేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు మీటర్లు ఉరి తాళ్లు అన్న చంద్రబాబు, ఇప్పుడైనా స్పందించాలన్నారు.



ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ప్రకాశం జిల్లా, కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు ఇ. వి రమణ విజిలెన్స్ అండ్ ఇన్ఫోసిమెంట్ ఇన్‌స్పెక్షన్ ఆఫ్ పోలీస్ వి.సుధాకర్ రెడ్డి నెల్లూరు డిఇఒ కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.నర్సోజిరావులు మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని ఎరువులు, పురుగు మందులు దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను, సంబంధిత రికార్డులు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ను ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలని బిల్లులను తప్పనిసరిగా రైతులకు అందజేసి సంతకం తీసుకోవాలని సూచించారు. 145.5 లీటర్లు, 97.5 పురుగు మందుల స్టాక్ నిలుపుదల చేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు వి.దేవసేనమ్మ, మండల వ్యవసాయ అధికారి కె.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

నాసిరకంగా జాతీయ రహదారి నిర్మాణ పనులు

- కొద్దిపాటి వర్షానికే పగుళ్లిచ్చిన వైనం

- కొరవడిన నాణ్యతా ప్రమాణాలు

- లోపించిన పర్యవేక్షణ

ప్రజాశక్తి - వలేటివారిపాలెం

ప్రకాశం జిల్లా శింగరాయికొండ నుంచి నెల్లూరు జిల్లా మాలకొండ వరకూ 54.7 కిలోమీటర్లు పొడవుతో సుమారు 230 కోట్లతో 167-బి పేరుతో జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. అయితే ముందువైపు పనులు జరుగు తుండగానే వెనుక వేసిన తారురోడ్డుకు పగుళ్లిచ్చాయి. చిన్నపాటి వర్షానికి కోతకు గురవుతున్న అప్రోచ్ రోడ్లు, కల్వర్టులు వంటివి జాతీయ రహదారి పనుల్లో నాణ్యతా లోపాలను కళ్లకు కట్టినట్టు చూపుతున్నాయి. ఈ జాతీయ రహదారి పనులు మొదలైనప్పటి నుంచి అడ్డదిడ్డంగా సాగుతున్నాయన్నారు. నాణ్యతా ప్రమాణాలు నిభంధనలు పాటిం చడంలేదని ప్రస్తుత ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆరోపించారు. ఎంఎల్ఎ నాగేశ్వరరావు తమ కార్యకర్తలతో కలిసి అయ్య వారిపల్లి దగ్గర ఉన్న మెటల్ క్వారీని పరిశీలించారు. రోడ్డుకు నాసిరకం మెటల్ వినియోగిస్తున్నారని, ఈ మెటల్ వినియో



కూనిపాలెం టోల్ గేట్ సమీపంలో పగుళ్లిచ్చిన తారురోడ్డు



జాతీయ రహదారిపై వర్షానికి కొట్టుకపోయిన అప్రోచ్ రోడ్డు

గిస్తే రోడ్డు మన్నిక దెబ్బతింటుందని పర్యవేక్షణ అధికారులకు సూచించారు. దానిపై స్థానికులు పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా పనుల తీరులో మార్పు రాలేదు. ఇదీ శింగరాయ కొండ నుంచి మాలకొండ వరకూ జరుగుతున్న జాతీయ రహదారి పనుల దుస్థితి. శింగ రాయికొండ నుంచి మాలకొండ వరకూ మధ్య మధ్యలో గ్రామాల్లో వంతెనలు వంటి పనులు భూగర్భ డ్రెయినేజీలు వంటి పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తి కాకుండానే కూనిపాలెం టోల్‌గేట్ సమీపంలో నిర్మాణంలో నాణ్యతా లోపాల వల్ల ముందు వేసిన తారురోడ్డుకు పగుళు ఏర్పడ్డాయి. పోకూరు, పోలినేనిపాలెం గ్రామాల మధ్య చిన్నపాటి వర్షానికి అప్రోచ్ రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో పనుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. కూనిపాలెం సమీపంలో అప్రోచ్ రోడ్డు కోతకు గురవడంతో వంతెనకు రెండు వైపుల గండి పడి ప్రమాదకరంగా మారాయి.పర్యవేక్షణ అధికారులు కమిషన్ల కక్కుర్తి, కాంట్రాక్టర్ స్వారం వెరచి కోట్లు పనులు నాసిరకంగా జరుగుతు న్నాయి. పర్యవేక్షనాధికారులు కమిషన్లకు కక్కుర్తి పడి పనుల వైపు వెళ్లడంలేదు. దీంతో కాంట్రాక్టర్ నిబంధనలను తుంగలో తొక్కి పనులు ఇష్టానుసారంగా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాంతో పది కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన జాతీయ రహదారి పనులు మున్నాళ్ల ముచ్చటగా మారే అవకాశాలున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారి పనులు నాణ్యతగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-అనంతసాగరం

గత ప్రభుత్వంలో ఇచ్చిన జిఒలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం అనంతసాగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులై 10న డిమాండ్స్ డే కావున 42 రోజులుపాటు అంగన్‌వాడీలు చేసిన సమ్మెకు గత ప్రభుత్వం జూలై మాసం నుండి జీతాలు పెంచుతామని జిఒలు ఇచ్చిందన్నారు. వాటిని అమలు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి అన్వర్‌బాషా, అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు నాయకులు సునీత, నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి మండల పరిధిలోని బిజ్జంపల్లి జిల్లా ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ప్రధానోపాధ్యాయులు షేక్.నాయబ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. మీ పిల్లల భవిష్యత్తు మాది గ్యారెంటీ అంటూ తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేర్పించాలని పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కదిరినాయుడుపల్లి కాంప్లెక్స్ పరిధిలోని జెడ్‌పి పాఠశాలలోని ఒకటి నుండి ఐదవ తరగతి వరకు చదివే విద్యార్థులకు గంగిరామ చారిట్రబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ప్రవాస భారతీయులు గంగిరెడ్డి ఓబుల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కేశవరెడ్డి ల దాతృత్వంతో ట్రస్ట్ చైర్మన్ బంకా శ్రీధర్‌రెడ్డి చేతులు మీదుగా నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. అనంతరం కదిరి నాయుడుపల్లి ఉన్నత పాఠశాలలో 2023-24 సంవత్సరంలో పదవ తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన సుస్వంత్, సుధ, గోవర్ధన్‌లకు రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేల వంతున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. విద్యార్థులకు రాబోయే విద్యా సంవత్సరంలో కూడా ఇంతే మొత్తంలో నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రామిరెడ్డి సోదరులు విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు ఎదిగారని, వారు అమెరికాలో ఉంటున్నప్పటికీ ఎల్లప్పుడూ ఈ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తు గురించే ఆలోచిస్తుంటారని, తమలాగే తమ ప్రాంతంలోని విద్యార్థులందరూ బాగా చదువుకొని గొప్ప స్థాయికి ఎదగాలనే సదుద్దేశంతో గత 25 సంవత్సరాల నుండి పడమటి నాయుడుపల్లి, చుంచులూరు పంచాయతీల్లోని విద్యార్థులకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కదిరినాయుడుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసులు, ఎ.శ్రీనివాసులు, వెంకట రమణయ్య, సుబ్బారెడ్డి, శివయ్య, విజయారెడ్డి, రత్నయ్య, విజయభాస్కర్ రెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బయ్య, వెంగయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతసాగరం



మండలంలోని గ్రామాల్లోని సమస్యలపై వచ్చిన పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించి వాటిని 24గంటల్లో పరిష్కరించాలని ఎంపిడిఒ తాజ్‌మస్రూర్ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి, ఇంజనీర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఎఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమస్యలపై పత్రికా కథనాల్లో వచ్చిన వాటిపై 24గంటల్లో సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రతిరోజు డ్రెయినేజ్ కాలువల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలన్నారు. మురుగు కాలువల వద్ద బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచాలని, రోడ్డు పక్కనే ఉండే చెత్తదిబ్బలను తొలగించాలన్నారు. ఎఎన్ఎంలు డ్రైడేను కచ్చితంగా పాటించాలన్నారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగీ, డయేరియా వ్యాధులు ప్రబలకుండా గ్రామ పంచాయతీలు చేపట్టిన పనులకు ప్రజలు సహకారం ఉండాలన్నారు. డిపిఒ ఆదేశాలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల గ్రామ విస్తరణ అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అవార్డ్ నామినేషన్స్‌కు శిక్షణ

ప్రజాశక్తి-ఉదయగిరి



నేషనల్ పంచాయతీ అవార్డ్స్ నామినేషన్స్ కోసం జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి, సిఇఒ కన్నమనాయుడు వెబ్ ఎక్స్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వెబ్ ఎక్స్ ద్వారా జరిగిన శిక్షణ తరగతులకు ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు హాజరయ్యారు. అనంతరం ఐహెచ్‌ఎల్ సర్వే ఒడిఎఫ్ సర్వే పిఆర్-1 యాప్ గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కరిముల్లా, నాగూర్ బీ, చంద్రశేఖర్ రెడ్డి, శిల్పా ప్రసన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంఇఒ తోట శ్రీనివాసులు

పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని జిల్లా ఉన్నత పాఠశాల కృష్ణంపల్లిలో జరుగుతున్న స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ అదనపు తరగతి గదుల నిర్మాణం, నూతనంగా మంజూరైన టాయిలెట్స్ నిర్మాణ పనులను, మధ్యాహ్న భోజనశాల పనులు ఇంతవరకు జరిగిన వాటిని పరిశీలించగా సంతృప్తికరంగా పనులు జరిగాయన్నారు. కాంక్రీట్ పనులు స్లాబునకు ప్లాస్టింగ్స్‌కు ప్రతిరోజు ఉదయం సాయంత్రం పూట వాటర్‌తో క్యూరింగ్ చేయాలని నాణ్యత ప్రమాణాలతో చివరి దశలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం వేసవి సెలవులలో నూతన టాయిలెట్స్ భోజనశాల పనులు దగ్గరుండి పూర్తి చేయించిన ప్రధానోపాధ్యాయులు శివరామి రెడ్డిని, ఫిజిక్స్ ఉపాధ్యాయులు రమేష్‌ను ఎంఇఒ అభినందించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

10వ అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు గడ్డం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మంగళవారం స్థానిక శిశుసంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది లావణ్యకు అంగన్‌వాడీల సమస్యల వినతి పత్రం అందజేసి వారు మాట్లాడుతూ కేంద్రం లో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు అధికారం లోకి వచ్చాయని, గతంలో బిజెపి ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామని ఐసిడిఎస్‌ను బలోపేతం చేస్తామన్న హామీలు నేటికి నెరవేరలేదని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని ఇచ్చిన తీర్పును పక్కనపెట్టారని తెలిపారు. వివిధ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులు అంగన్‌వాడీలను బలవంతంగా రాజీనామాలు చెయ్యాలని బెదిరిస్తున్నారని, సెంటర్లకు తాళాలు వేస్తున్నారని, హెల్పర్లు మానుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వేధింపులను అరికట్టాలని కోరుతూ జూలై 10 అంగన్‌వాడీల కోర్కెల దినం పాటించాలని అఖిలభారత కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం అంగన్‌వాడీల కోర్కెల దినం సందర్భంగా 42 రోజులు సమ్మెకాలంలో ఇచ్చిన మినిట్స్ కాపీలోని అంశాలు వెంటనే జిఒలు ఇచ్చి వారి సమస్యలు పరిష్కారం చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ప్రమీల, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



మాట్లాడుతున్న కమిటీ పెద్దలు

చర్చి వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-ఉదయగిరి

తెలుగు బర్డిట్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి 139 సంవత్సరాలు పూర్తయినా సందర్భంగా మంగళవారం నుంచి మూడ్రోజుల పాటు నిర్వహిస్తున్న వేడుకలకు ప్రతిఒక్కరూ పాల్గొనాలని కమిటీ పెద్దలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆంగ్లేయులు వచ్చి ఈ ప్రాంతంలో మొదటిగా హాస్పిటల్ తరువాత స్కూలు, చర్చిని నిర్మించడం జరిగిందన్నారు. అప్పటి నుండి నేటి వరకు ఆ చర్చి లో ఇప్పటికీ ప్రార్థనలు జరుగుతున్నాయన్నారు. హాస్పిటల్ ఒక స్కూల్‌ను నిర్మించడం స్కూల్లో చదువుకున్న విద్యార్థులకు వసతి అవసరమని హాస్టల్‌ను బాలురకు, బాలికలకు నిర్మించడం జరిగిందని వీరందరికీ వైద్యం కావాలని ఒక హాస్పిటల్లో 100 సంవత్సరాల క్రితమే నిర్మించారని నేటికీ వాటి జ్ఞాపకాలు మిగిలే ఉన్నాయన్నారు. అప్పటి ఆంగ్లేయులు తహశీల్దార్ కార్యాలయం, జైలు, పోలీస్ స్టేషన్ నిర్మించడం జరిగిందని ఆ రోజుల్లోనే ఉదయగిరి ప్రాంతీయులు ఆహారం లేక అల్లాడుతున్న రోజుల్లో పనికి ఆహార పథకం ఏర్పాటు చేసి ప్రతివ్యక్తి కష్టపడాలని నిర్ణయించుకుని అందరికీ ఉచితంగా గోధుమలు, పాలపిండి ఆరోగ్యానికి సంబంధించిన పండ్లు ఆకుకూరలు అందించిన ఘనత కూడా ఉందన్నారు. ఈ ఎబిఎం స్కూల్లో చదువుకున్న వ్యక్తులు అందరూ ఎన్నో ఉన్నత పదవులు సంపాదించుకున్నారు. కనుక ఆంగ్లేయులు నిర్మించిన నిర్మాణంలో ఒకటైన ఈ ఆలయంలోకి కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొనాలని వారు కోరారు.

యుటిఎఫ్ నిరంతరం పోరాటం

ప్రజాశక్తి-అనంతసాగరం

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై యుటిఎఫ్ నిరంతరం పోరాడుతూ, అనేక త్యాగాలను చేసిందని యుటిఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి అన్నారు. చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయాన్ని సాధించే విధంగా పని చేస్తుందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ అన తెలియజేశారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ ఆశయాలుగా ఉన్న సంఘం కాబట్టి మండలంలోని అత్యధిక ఉపాధ్యయులు యుటిఎఫ్‌లో చేరుతున్నారన్నారు. ఈ సభ్యత్వ క్యాంపెయిన్ కార్యక్రమంలో అనంతసాగరం మండల యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సాదిక్, సీనియర్ నాయకులు ఎస్డిడి. వలీ అహ్మద్, కిరామి మహబూబ్ బాషా, నాగరాజు, నాయబ్ జానీ, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్న యుటిఎఫ్ నాయకులు

పండ్లు అందజేత

ప్రజాశక్తి-ఉదయగిరి

డిప్యూటీ సిఎంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎంపికపై జనసేన మండల నాయకులు నాగేళ్ళ రవి, కూటమి నాయకులతో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పాలు పండ్లు బ్రెడ్‌లు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని రోగులకు బాలింతలకు కూటమి నాయకులు గూడూరు వెంకటేశ్వరరావు, గాజుల బాబు, మట్ల లక్ష్మయ్య, అల్లూరి అంకయ్య, అర్షద్, రోశయ్యతో కలిసి జనసేన నాయకులు రవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు గూడూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి అభ్యర్థిగా జనసేన నాయకులు పవన్ కళ్యాణ్ డిప్యూటీ సిఎంగా పదవి చేపట్టడం సంతోషదాయకమని అందులో భాగంగా జనసేన నాయకులు ఈ కార్యక్రమం చేపట్టడం మరింత సంతోషంగా ఉందన్నారు. కూటమి అభ్యర్థిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన వాగ్దానాల్లో మొదటిగా డిఎస్‌సి ప్రకటన పూర్తి చేశారని రెండవది వృద్ధులు, విద్యార్థులు వికలాంగులు మానసిక రోగులకు రూ.3వేల నుండి రూ.4వేలకు పెంచడంతోపాటు ఉచిత ఇసుక కూడా శ్రీకారం చుట్టారని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే కార్యక్రమాలు అమలు చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక్కరికే దక్కిందన్నారు. ఇకనుండి రాష్ట్ర ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ముఖ్యమంత్రి ముందుకు సాగుతారని ఆశాభవం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చేపట్టే ప్రతి సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాల్లో జనసైనికులుగా కూటమి అభ్యర్థులతో కలిసి ముందుకు సాగుతామని రవి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు, కూటమినాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పండ్లు, బ్రెడ్ అందజేస్తున్న కూటమి నాయకులు



పశుగ్రాస వారోత్సవాలు

ప్రజాశక్తి-సంగం

సంగంలోని పశువైద్యశాలలో పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పశు సంవర్ధక శాఖ ఎడి జయచంద్ర పాల్గొని పశుగ్రాసంలో రకాలు, వాటి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పశు గ్రాసం ప్రాముఖ్యత గురించి వివరించారు. పశుగ్రాసంతో పాల ఉత్పత్తి పెంచుకుని రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చున్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది, జలాల్ బాషా, రాజేష్, రమ్య, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ మస్తాన్‌వలీ

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి-సీతారామపురం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం పంపిణీలో ప్రభుత్వ మెనూ పాటించి నాణ్యమైన ఆహారం అందించాలని ఎంఇఒ మస్తాన్ వలీ పేర్కొన్నారు. మంగళవారం సీతారామపురం ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి, భోజనాన్ని రుచి చూసి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వహకులు వంట వండే పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాత్రలను ప్రతిరోజు శుభ్రపరుచుకుని జాగ్రత్త పరచాలని తెలిపారు. ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని విద్యార్థిని విద్యార్థులు అందించాలని తెలిపారు.



రూ.10వేలు అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణ పరిధిలోని 3వ వార్డు లక్ష్మణరావుపల్లిలో ఉన్న పీర్లచావడి వద్ద మొహర్రం పండుగను వైభవంగా నిర్వహిస్తారు. ఎల్ఆర్‌పల్లి ముస్లిం యూత్ కోరిక మేరకు మొహర్రం నిర్వహణ ఖర్చులకు డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ చైర్మన్, ఎస్ వి ప్రజా వైద్యశాల అధినేత డాక్టర్ ప్రణీత్ రూ.10వేలు చెక్కును ముస్లిం యూత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం యూత్ డాక్టర్ ప్రణీత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ సందీప్, డాక్టర్ కుమార్ తోడేటి అశోక్ తదితరులున్నారు.

వైద్య శిబిరంలో పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి

వైద్య శిబిరంలో సిబ్బంది అందిస్తున్న సేవలను గండిపాలెం ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.జి.నౌషద్‌బాబు పరిశీలించారు. మంగళవారం స్థానిక పట్టణంలో కరీమావీధిలో ఆరోగ్య వైద్య శిబిరంను గండిపాలెం పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ ఎం.శివకల్పన ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. అందులో భాగంగా ఈ వైద్య శిబిరంలో ఆరోగ్య సహాయకులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తల వైద్యబృందాలు చేపట్టి ఇంటింటి లార్వా జ్వరం సర్వేను పరిశీలించామన్నారు. ప్రజలకు డెంగీ, డయేరియా వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య సూత్రాల కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు ఆరోవ్యంపై అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా 11న నిర్వహించే ప్రపంచ జనాభా దినోత్సవం గురించి అవగాహన కల్పించి చిరు వ్యాధులకు ఆరోగ్య శిబిరం ద్వారా చికిత్స ఇస్తూ చేపట్టే సర్వేలో సిబ్బందికి పలు సూచనలు చేసి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.పి కె.నాగార్జున, ఆరోగ్య పర్యవేక్షకులు వై.న్నయ్య, రోగ్య సహాయకులు కె.శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు, ఎస్‌కె రబ్బాని, ఎఎన్ఎంలు ఎ.నూర్జహాన్, ఎం.స్వాతి, కె.జయమ్మ, ఆశా కార్యకర్తలు సలోమి, శ్రీదేవి, మహబూబ్ జానీ, నాజున్ను, పి.లక్ష్మ పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న యూనిట్ అధికారి నౌషద్‌బాబు

సిఎంల చిత్రపటాలు బహూకరణ

ప్రజాశక్తి-సీతారామపురం

మండల టిడిపి, జనసేన ఎన్‌డిఎ కూటమి ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, ఉదయగిరి ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ చిత్రపటాలను కూటమి నాయకులు అధికారులకు బహూకరించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో చేయలేని పనులు కూడా ఎన్‌డిఎ ప్రభుత్వ ఏర్పడిన నెల రోజుల్లోనే చేయడం జరిగిందని, ముఖ్యంగా మెగా డిఎస్‌సి ఫైల్‌పై మొదటి సంతకం చేశారని, పెన్షన్‌దారులకు వైసిపి ప్రభుత్వంలో రూ.1000 పెంచడానికి 5సంవత్సరాలు పడితే, ఎన్‌డిఎ ప్రభుత్వంలో ఒకేసారి రూ.1000 పెంచామన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు, మాజీ జెడ్‌పిటిసి కలివెల జ్యోతి, జనసేన జిల్లా కార్యదర్శి ఆలూరు రవీంద్ర, జనసేన సీతారామపురం, ఉదయగిరి మండలాల అధ్యక్షులు పాలిశెట్టి శ్రీనివాసులు, కల్లూరు సురేంద్ర రెడ్డి, సర్పంచ్ తోకల రామచంద్ర, టిడిపి తెలుగు యువత నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఆదవేని రఘురామయ్య, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఆలూరి శ్రీనివాసులు, నాయకులు కుర్ర కృష్ణయాదవ్, ఎడమ ప్రవీణ్ కుమార్, మహాలక్ష్మయ్య, బండి రవి, పసుపులేటి సురేష్, పుల్లయ్య, సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం బోగోలు మేజర్ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మండల టిడిపి నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి చిత్రపటాలను బోగోలు పంచాయతీ ఆఫీసులో పంచాయతీ అధికారులకు బహూకరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపిటిసి చిలకపాటి వెంకటేశ్వర్లు, బిజెపి మండల అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, బోగోలు మండల బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షులు ఆవుల సురేష్ మహిళా నాయకురాలు అరుణ, పార్వతి, టిడిపి నాయకులు ప్యాట్రిక్, కుందుర్తి వరప్రసాద్, గన్నిపినేని నాగరాజు, సాధనాల మనోహర్ నాయుడు, బోగిరి ప్రభాకర్, మాకా, ఎస్ ఎస్ యాదవ్, గోచిపాతల సంజయ్, నాగరాజు, రవి, వాసు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి ఎంపిడిఓ కార్యాలయంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ చిత్రపటాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ డి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి ఈ చిత్రపటాలను కార్యాలయానికి అందజేశారన్నారు. మండలంలోని 12 సచివాలయాల్లో సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని సూచించామన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది 100శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని 12 సచివాలయ సిబ్బందితో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఉదయం 10 గంటల లోపు సచివాలయాల విధులకు తప్పనిసరిగా హాజరై బయోమెట్రిక్ 100శాతం ఉండేలా చూడాలన్నారు. సాయంత్రం 5గంటల తర్వాత బయోమెట్రిక్ హాజరు వేయాలని నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి మల్లికార్జున, ఎఓ రేణుక, సీనియర్ అసిస్టెంట్ గోపి, జూనియర్ అసిస్టెంట్ సమద్ ఇమ్రాన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి విడవలూరు

విడవలూరు మండలం ఊటుకూరు గ్రామం సమీపంలోని జొన్నవాడ దశయ్యకు చెందిన రొయ్యలగుంట్ల వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి కరెంటు షాక్ కొట్టి చనిపోయినట్లుగా విడవలూరు ఎస్ఐ రాజా తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు హనుమంతరావు (28) ఊటుకూరు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించామని తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు మృతుడు రొయ్యల దొంగతనానికి వచ్చినట్లుగా స్థానికులు అనుమానిస్తున్నారన్నారు.

పంచాయతీలకు నిధుల్లేవ్..

- గ్రామాల్లో పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే.. - పంచాయతీలకు నిధులు కేటాయించాలని సర్పంచ్‌ల వేడుకోలు..

ప్రజాశక్తి-మర్రిపాడు

గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందితే దేశాభివృద్ధి అంటారు కానీ ప్రస్తుతం దానికి విరుద్ధంగా గ్రామ పంచాయతీల్లో పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా ఎన్నికైన సర్పంచులు తమసొంత నిధులు వెచ్చించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతున్నారు. ఏ పంచాయతీలో చూసిన నిధులు కొరత వెంటాడుతుంది. పంచాయతీలో డబ్బులు లేకపోవడమే దీనికి కారణం. గ్రామాల్లో తాగునీరు పారిశుధ్యం వీధిదీపాలు రోడ్ల మరమ్మ తులు వంటివి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయి. పంచాయతీల అభివృద్ధి కోసం ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు బడ్జెట్‌లో కేటాయించే నిధులు ఎక్కడికి పోతున్నాయని ప్రశ్నగానే మిగిలి పోయిందని ప్రజలు అంటున్నారు. గ్రామాలను అభివృద్ధి చేయాలని



ఉత్సాహంతో గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నికలలో పోటీ చేసి గెలిచి సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత నిధుల లేమితో ఏమీ చేయలేని పరిస్థితులలో సర్పంచ్‌లు ఉన్నారు.

వార్షిక బడ్జెట్ నిధులు ఆధారంగా తాగునీరు పారిశుధ్యం వీధి దీపాలు రోడ్ల మరమ్మతులు వంటి వాటిని సర్పంచ్‌లు బాధ్యతాయుతంగా నిర్వర్తించి పంచాయతీలో పనులు కుంటుపడకుండా చేసేవారు. ఇప్పుడు సర్పంచులకు అలా చేయలేని పరిస్థితి దాపురించింది. గత ప్రభుత్వ హయాంలో 14, 15 వార్షిక బడ్జెట్‌లో నిధులు ఉన్నాయని పంచాయతీ అధికారులు నివేదికలు ఇవ్వగా పాడైన రోడ్లు, బోర్లు, వీధి దీపాలు అభివృద్ధి పనులు చేశాక బయోమెట్రిక్ పనిచేయడం లేదన్నారు.

పంచాయతీలో పలు అభివృద్ధి పనులు చేశాక నిధుల కోసం పంచాయతీ బ్యాంకు ఖాతా చూసేసరికి ఖాతాలో ఉన్న నగదును గత ప్రభుత్వం వెనక్కు తీసుకోవడంతో సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనులకు బిల్లులు రాక మరోవైపు తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఏమి చేయాలో తోచక సతమతం అవుతు న్నామని వాపోతున్నారు. వైసిపి ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశాక సర్పంచ్‌లు చేసే పనులు గ్రామ వలంటీర్లకే పరిమితమయ్యాయని సర్పంచ్ లు ఏ కార్యక్రమం చేపట్టాలన్నా చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో అభివృద్ధి పనులు చేసేందుకు వెనుకాడు తున్నామని పలు గ్రామాల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పడ్డ ఎన్‌డిఎ ప్రభుత్వం పంచాయతీలకు నిధులను సమకూర్చి గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని వారు కోరుతున్నారు.

బిటిఎ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని కరటంపాడు, పేరారెడ్డిపల్లి, గవర్నమెంట్ హైస్కూలు జెడ్‌పి బాలికల హైస్కూలు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో బిటిఎ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బిటిఎ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లం వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం 117జిఓను రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని కోరారు. బిటిఎ రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మండలంలోని పాఠశాలలన్నీ సందర్శించి ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా బిటిఎ జిల్లా అధ్యక్షులు మణిసుబ్బు మాట్లాడుతూ జిల్లాలో బహుజన టీచర్స్ అసోసియేషన్ సమర్ధవంతంగా పనిచేస్తుందని, ఉపాధ్యాయ హక్కుల సాధనకు ముందు



ఉంటుందని, సంఘాన్ని ఉపాధ్యాయులు అందరూ బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు. తర్వాత బిటిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సాధన కోసం బిటిఎ నిరంతరం యంత్రం కృషి చేస్తుందన్నారు. అత్మకూరు డివిజన్‌లో బిటిఎను బలోపేతం చేయాలని కోరారు. తరువాత ఆత్మకూరు ఉపవిద్యాశాఖ అధికారిని కలిసి విద్యారంగ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో బిటిఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు రొట్టె.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఊట్ల.రఘు, జిల్లా నాయకులు సుధాకర్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.కొండయ్య, డాక్టర్ ఎం.ప్రసాద్, బాలయ్య, స్నేహ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు మోక్షమెప్పుడో..!

- 11ఏళ్లుగా మూతపడ్డ ఫ్యాక్టరీ

- ఎన్నికలు వచ్చినప్పుడల్లా తాజా మాజీ

- సిఎంల హామీలు ఏమయ్యాయి..

- జీతాల్లేక రోడ్డును పడ్డ కార్మికులు

ప్రజాశక్తి-కోవూరు

జిల్లాలోని మూతపడ్డ కోవూరు కో- ఆపరేటివ్ చక్కెర కర్మాగారం మూతపడిన విషయం విధితమే. 2014 ఎన్నికల తరువాత తాజా సిఎం చంద్రబాబు నాయుడు వెంకటేశ్వరపురం ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన సభలో కర్మాగార పునరుద్దరణకు రూ.100 కోట్లు ప్రకటించారు. ఆ మాట నీటి మీద రాత లాగా మిగిలింది. మళ్లీ 2019 ఎలక్షన్ ముందు పాదయాత్రలో బుచ్చిరెడ్డిపాలెంకి వచ్చిన మాజీ సిఎం వై ఎస్ జగన్, చక్కెర కర్మాగారాన్ని పునరుద్దరణ చేస్తావని రైతులకు హామీ ఇచ్చారు. తాజా, మాజీ సిఎంలు హామీలకే పరిమితమయ్యారు. మరలా 2024 ఎన్నికల ప్రచారంలో సుగర్ ఫ్యాక్టరీ సమస్యలు పరిష్కరిస్తానని కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హామీ ఇచ్చారు.



కోవూరు సుగర్ ఫ్యాక్టరీ

సుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు

పులిగండ్ల శ్రీరాములు



సుగర్ ఫ్యాక్టరీని సహకార రంగంలోని కొనసాగించాలి చక్కెర కర్మాగార పునరుద్ధర ణకు అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఇవ్వాలి. యంత్రాలు ఓవరాయిలింగ్ చేసి పనికిరాని యంత్రాలను తీసివేసి నూతన యంత్రాలు కొనుగోలు చేయాలి. రైతులకు చెరకు వేసుకొనుటకు 12 నెలలు సమయం ఇచ్చి అదే సమయంలో కర్మాగారం పునరుద్ధరణ చేయాలి. ఫ్యాక్టరీ విశాలమైన స్థలంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి. నిరుద్యోగులకుఉపాధి కల్పించాలి.

ఫ్యాక్టరీ పునరుద్ధరణకు సహకరించాలి

చెరకు రైతుసంఘం జిల్లా కార్యదర్శి

గండవరపు శ్రీనివాసులు



సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 3600 మంది షేర్ హోల్డర్స్ ఉన్న రైతులు అందరూ కూడా అమ్మకపు విధానాన్ని వ్యతిరేకించి ఫ్యాక్టరీ ఆవరణలో మూడు సదస్సులు ఏర్పాటు చేసి సదస్సులో ఏకగ్రీవ తీర్మానం అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని 3వేల మంది అనేక రకాల కార్మికులు అభివృద్ధి సంక్షేమానికి ఫ్యాక్టరీ కి అవసరమైన నిధులు మంజూరు చేయించాలి. ఫ్యాక్టరీ పునరుద్ధరణ చేయాలని రాష్ట్ర చెరకు రైతు సంఘం, జిల్లా రైతు సంఘం తరపున డిమాండ్ చేస్తున్నాం.

కమీషన్లకు కక్కుర్తిపడ్డారు..

పి.శ్రీనివాసులు సుగర్ ఫ్యాక్టరీ

సిఐటియు జనరల్ సెక్రటరీ, కార్మికుడు



కోవూరు సహకార చక్కెర కర్మాగారం బంగారు బాతుగుడ్డుగా మారింది. రైతులకు, కార్మికులకు, అధిక ఆదాయాన్ని అందిస్తున్న చక్కెర కర్మాగారంలో కొందరు అధికారులు చేసిన పాలనాపరమైన నిర్లక్ష్యం, కమీషన్ల కక్కుర్తికి పాల్పడ్డారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి అడ్డగోలుగా యంత్రాలను అమర్చడం వల్ల అవి సక్రమంగా ఉపయోగించు కోవడంలో తీవ్ర వైఫల్యం చెందాయి. కొండలా పెరిగిన చక్ర వడ్డీలతో పెరిగిన అప్పులను తీర్చలేక కర్మాగారాన్ని 2013లో అధికారులు మూతవేశారు. కార్మికులకు సుమారు రూ.25 కోట్ల అప్పులను చెల్లించి తిరిగి కర్మాగారాన్ని తెరిపిస్తే వేలాది మంది కార్మికులకు ఉపాధి కలుగుతుంది. గత 11ఏళ్లుగా జీతాలు లేకపోవడంతో వందలాది మంది కార్మికులు రోడ్లపాలయ్యారు.

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, గూడూరు
O.S No.113/2018

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, పొదలకూరు బ్రాంచి, (Rep. by its Branch Manager) ...వాది

And
1. లేట్ ఉప్పులమర్రి చిన్న మస్తాన్ రెడ్డి
2. ముత్తెం సుధాకర్
3. ఉప్పలమర్తి హారతి
4. యం.మౌనిక ...ప్రతివాదులు

ప్రతివాదులకు నోటీసు

D3
ఉప్పులమర్తి హారతి, W/o లేట్ ఉప్పులమర్తి చిన్న మస్తాన్ రెడ్డి, C/o రామ్మూర్తి నాయుడు, LIC Agent డోర్ నెం. 26-13-288, సాయిబాబా టెంపుల్ బ్యాక్ సైడ్ రోడ్డు, బి వి నగర్, నెల్లూరు, SPSR నెల్లూరు జిల్లా

D4
యం. మౌనిక, D/o లేట్ ఉప్పులమర్తి చిన్న మస్తాన్ రెడ్డి, C/o రామ్మూర్తి నాయుడు, LIC Agent డోర్ నెం. 26-13-288, సాయిబాబా టెంపుల్ బ్యాక్ సైడ్ రోడ్డు, బి వి నగర్, నెల్లూరు, SPSR నెల్లూరు జిల్లా

పై కోర్ట్ లో వాది మీ మీద బాకీ నిమిత్తము దావా వేయగా, దీనిలో Respondents నోటీసు నిమిత్తము 09-08-2024 (శుక్రవారం) తేదికి వాయిదా వేసియున్నారు. కావున మీరు గాని మీ తరుపు లాయర్ పై కోర్ట్ లో ఉదయం 10.30 గంటలకు పై తేదీన హాజరు కావలయును. లేని యడల మీ మీద పరోక్ష తీర్మానము జరుపబడును.

పొదలకూరు,
05-07-2024

ఇట్లు
కె.నరేష్, M.A., L.L.B.,
వాది తరపు న్యాయవాది
సెల్: 9440110647
Bar Council No.AP/3762/1999

In the Court of the I Addl.
Junior Civil Judge : Nellore
O.S.No. 401 / 2021

UCO Bank, Brindavanam Branch, Nellore City, Represented by its **Branch Manager** - Plaintiff

Vs

SK.Sajida Begum - Defendant

Notice

To,
SK.Sajida Begum, W/o **Sardar Basha,** residing at Flat No.4000, Block No.E, Y.S.R. Nagar, Kothur, Nellore Bit-1, SPSR Nellore District.

పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే07-08-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

Sk. Yasdani, B.Com., L.L.B.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.
సెల్: **94403 90245**

In The Court of The 1st Addl.
Junior Civil Judge : Nellore
O.S.No. 206 / 2022

M/s. State Bank of India,
Town Branch, Railway Feeders Road, Nellore, Rep.by its Chief Manager - Plaintiff

Vs

Kanimela Vijaya Kumar - Defendant

Notice to Defendant

Kanimala Vijaya Kumar,
S/o **K.Subbaiah,** D.No. 2-6-93, Kummari Street, Nar Mahalakshmi Temple, Nawabpet, Nellore.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టు లో బ్యాంక్‌లోన్ బాకీ రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే19-07-2024** దిన వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గం॥లకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దామిశెట్టి సుభాషిణి, M.A., L.L.M., P.hd.,
వాది తరపు న్యాయవాది, నెల్లూరు.

పలుచోట్ల కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు


విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-వెంకటాచలం

మండలంలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ ఆనంద్ పర్యటించారు. వెంకటాచలంలోని అంగన్‌వాడీ కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రం, చెముడు గుంటలోని జిల్లా పరిషత్ హైస్కూల్, జిల్లా సైన్స్ మ్యూజి యాన్ని కలెక్టర్ పరిశీలించారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, చిన్నారుల హాజరు, మెనూ, చిన్నారుల ఆరోగ్య వివరాలను అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించి రుచి చూశారు. పిల్లల బరువు, ఎత్తు మొదలైన వివరాలు తెలుసుకున్నారు. హాజరు పట్టిక, పలు రిజిస్టర్లను, యాప్లలో నమోదు చేస్తున్న చిన్నారుల వివరాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్ని నిబంధనలు పాటిస్తూ, చిన్నారులను మంచిగా చూసుకోవాలని అంగన్వాడి సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ తాను జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టానని, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించడంతోపాటు, తాను పలు విషయాలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు చెప్పారు. ఈ అంగన్వాడి కేంద్రం పనితీరు చాలా బాగుందని పేర్కొన్నారు. చిన్నారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. వెంకటాచలంలోని

సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఓపి, క్యాజువాలిటీ, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై రోగులతో మాట్లాడారు. ఆస్పత్రికి సంబంధించిన పలు విషయా లను వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. వైద్య సేవల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచిం చారు. మండలంలోని చెముడు గుంట జిల్లా పరిషత్ హైస్కూల్‌ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, భోజనం రుచిగా ఉందా అనే వివరాలను విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థు లకు అందించిన నోట్ పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న కిట్లు అందరికీ అందాయా? అని అధికారులను అడిగారు. బ్యాగులు తప్ప మిగిలిన అన్ని సామగ్రి విద్యార్థులకు అందించామని హెచ్‌ఎం అరుణ తెలిపారు.

సైన్స్ మ్యూజియం పరిశీలన

చెముడుగుంటలోని జిల్లా సైన్స్ మ్యూజియాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యార్థులందరినీ మ్యూజియానికి తీసుకొచ్చి వారికి సైన్స్ పరమైన అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని ప్రయివేటు విద్యాసంస్థలకు కొంత మొత్తం నగదు నిర్దేశించి మెంబర్ షిప్ ఇవ్వాలని, తద్వారా విద్యార్థుల వద్ద ఎటువంటి రుసుము వసూలు చేయకుండా ఉచితంగా సైన్స్ మ్యూజియానికి అనుమతించవచ్చని సూచించారు. విద్యార్థులందరూ ఆకట్టుకునేలా మ్యూజియంలో సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు.కలెక్టర్ వెంట ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, డిసిహెచ్‌ఎస్ రమేష్ నాథ్, డిఇఒ రామారావు, జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం అరుణ, మెడికల్ ఆఫీసర్ వేదవల్లి వాణిశ్రీ, సిడిపిఒ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ ప్రశాంతి తదితరులున్నారు.


ఆస్పత్రిలో ని రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజలతో మమేకమై పనిచేయాలి

కోవూరు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ప్రశాంతిరెడ్డి

ప్రజాశక్తి-కోవూరు

గ్రామీణ ప్రజావసరాలు తీర్చడంలో సచివాలయాలు కీలక పాత్ర పోషించాలని కోవూరు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు ఎమ్మెల్యేగా తన విజయంలో కీలక పాత్ర వహించిన కొడవలూరు మండలం, యల్లాయపాలెం గ్రామస్తులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం యల్లాయపాలెం గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆమె.. అనంతరం సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న తీరును పర్యవేక్షించారు. పెండింగ్లో ఉన్న సమస్యలపై అధికారులతో సమీక్ష జరిపారు. ప్రజలతో మమేకమై పని చేయాలని, పారిశుధ్యం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమ తదితర విభాగాలకు చెందిన సచివాలయ కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం యల్లాయపాలెం నాయకులు, గ్రామస్తులతో సమావేశమయ్యారు. పెన్షన్లు, ఇళ్ల పట్టాలు, స్థానికంగా రోడ్లు, డ్రెయిన్లు తదితర స్థానిక సమస్యలకు సంబంధించి విజ్ఞప్తులు స్వీకరించారు. తాగునీటి సమస్యకు సంబంధించి విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఆర్ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. అనంతరం యల్లాయపాలెం హైస్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయులతో విద్యా సంబంధ విషయాలపై చర్చించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో కొడవలూరు ఎంపిడిఒ ప్రద్యుమ్న రావు, టిడిపి మండల అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, బెజవాడ వంశీధర్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, స్థానిక నేతలు వెంకట్రామి రెడ్డి, వంశి, భూలోక విజయ, బుడుగు శ్రీనివాసులు జనసేన శూలం బాబు, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హెల్మెట్ విధిగా ధరించాలి

ప్రజాశక్తి-కావలి

కావలి సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ ఎం.శోభ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విట్స్ ఇంజినీరింగ్ కళాశాల సెంటర్ లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయవాది ఇసకల సాయి ప్రసాద్ మాట్లాడుతూ వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ వాడకం వల్ల ప్రాణ రక్షణ, తలకు గాయాలు వంటి వాటిని రక్షించు కోవచ్చున్నారు. అలా బైక్ లపై వెళ్లే వారు హెల్మెట్ ధరించాలని, లేనిచో జరిమానా విధిస్తారని తెలిపారు.కార్యక్రమంలో న్యాయ వాదులు ఆర్. సాయి కృష్ణ, కె.చంద్రశేఖర్ రెడ్డి, లోక్ అదాలత్ మెంబర్ ఎం. మాలకొండా రెడ్డి, విట్స్ కాలేజీ సిబ్బంది, స్టూడెంట్స్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-వెంకటాచలం

పాత బకాయిలు వెంట చెల్లించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం మన కమిటీ నాయకులు స్థానిక ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యకాస. నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో ఉపాధి హామీ పథకం రోజు రోజుకు దిగజారుతుందన్నారు. పాత బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఒక్కొక్క కుటుంబానికి 24 రోజులు పని దినాలు కల్పించి రోజుకి 600 రూపాయలు కూలి ఇవ్వాలన్నారు. ఈ విధంగా ఉపాధి హామీ పథకాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కె నజీర్ బాషా, పొట్టే పాలెం సుధాకర్, తుమ్మతాటి వెంకయ్య, కోడూరు వెంకట కృష్ణయ్య, పత్రా వెంకయ్య, ఎస్.కె చాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



వికలాంగురాలి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కావలి

స్థానిక తుమ్మలపెంట రోడ్డులోని భవిత పాఠశాలలో ఘనంగా సక్షం కావలి టౌన్ కన్వీనర్ పడకండ్ల. నాగమణి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కావలి పట్టణ నివాసి అయిన పి. నాగమణి సక్షం కావలి పట్టణం లోని వికలాంగులందరికి ఎప్పుడు వారికీ సహాయసకారాలు అందిస్తూ, అందరికి చేదోడు వాదోడుగా ఉండే నాగమణి పుట్టినరోజు సందర్భంగా భవిత పాఠశాలలో విద్యార్థుల సమక్షం లో నిర్వహించుకోవడం జరిగింది.తదుపరి చిన్నారులకు పండ్లు, స్వీట్స్, పంపిణీచేశారు. అందరూ కలసి నాగమణికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ వికలాంగులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాఠశాల లో అవసరమైన సామగ్రిని దాతలు ఇప్పటికే చాలా అందించారని వారికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఇంకా దాతలు విరివిగా రావాలన్నారు. కార్యక్రమం లో హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్. ఘనీబాషా, అమ్మ నాన్న ఫౌండేషన్ అధ్యక్షులు మంగళగిరి వేణుగోపాల్, భవిత టీచర్లు మమత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన 'నాడు - నేడు' పనులు

- నిధులు లేకపోవడమే కారణం
- అసంపూర్తిగా నిలిచిన పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - లింగసముద్రం

నాడు - నేడు పనులు నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాడు-నేడు ఫేజ్ - 2 కింద మండలంలోని యర్రారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని ఉట్లవారి పాలెం ప్రాథమిక పాఠశాలకు నిధులు మంజూరైన నిధులతో పనులు ప్రారంభించి మొదలుపెట్టారు. సుమారు రూ. 12 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాల ఆధునీకరణ పనులు ప్రారంభించారు. నిధులు సరిపోకపోవడంతో పనులు అరకొరగా సాగుతున్నాయి.పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి పునాది వేసి బెడ్ కాంక్రీట్ వేశారు. ఫిల్లర్లు పోసి పనులు నిలిపివేశారు. పనులు పూర్తి చేయాలంటే నిధులను తక్షణమే విడుదల చేయాల్సి ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. నిధులు మంజూరు చేస్తే మిగిలిన పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. పనులు పూర్తి కాకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

గడ్డ కట్టిన సిమెంట్ బస్తాలు

నాడు -నేడు పనులు ప్రారంభమైనప్పుడు పాఠశాలకు వచ్చిన సిమెంట్ ఉపయోగించారు. ఇటీవల నిధులు అయిపోవడంతో మిగిలి ఉన్న సిమెంట్‌ను వినియోగించకపోవడంతో గడ్డకట్టి పనికిరాకుండా పోయాయి. 50 బస్తాల సిమెంటు ఉపయోగం లేకుండా పోయింది. అధికారులు నిర్లక్ష్య వైఖరితో పనుల్లో జాప్యం జరగడంతో పాటు, సిమెంటు గడ్డకట్టి పోయిందని విద్యార్థులు తల్లిదండ్రులు,గ్రామస్తులు విమర్శిస్తున్నారు.


గడ్డకట్టిన సిమెంట్ బస్తాలు

తక్షణమే పనులు పూర్తి చేయాలి

పాఠశాలలో నాడు - నేడు పనులను తక్షణమే పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని తల్లిదండ్రులు గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు పనులను పరిశీలించి అవసరమైన నిధులను మంజూరు కోసం ఉన్నతాధికారులతో చర్చించాలని కోరుతున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణ పనులు వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. వర్షం పడినప్పుడు పాఠశాల ఆవరణంలో మోకాళ్ల లోతున నీళ్లు నిలబడి ఉంటున్నాయని, దీనివల్ల విద్యార్థులు నీళ్లల్లో నడవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల కిటికీలు మరమ్మతులకు గురవడంతో పాటు,ఇతర పనులు చేయకుండా నిలిపివేయడంతో పాఠశాల పునర్ ప్రారంభం కావడం విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.

నిధులు తరలింపునకు చూస్తున్న అధికారులు

పాఠశాలలో మిగిలి ఉన్న నగదును వేరొక పాఠశాలకు తరలించేందుకు అధికారులు ప్రయత్నం చేయడం తెలుసుకున్న గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాల్సిన అధికారులు ఆ దిశగా శ్రద్ధ పెట్టకుండా ఈ పాఠశాలలో ఉన్న నిధులని ఇంకో పాఠశాలకు తీసు కువెళ్లేందుకు ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఉన్న నిధులతో పనులు పూర్తి చేసేందుకు చొరవ చూపకుండా అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుని, అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ప్రశాంతమైన వాతావరణంలో వారు విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లి దండ్రులు,గ్రామస్తులు కోరుతున్నారు.


నిలిచిపోయిన ప్రహరీ గోడ


గుంతగా ఏర్పడిన పాఠశాల ఆవరణం

తూర్పు యాదవపాలెం జలమయం..

ప్రజాశక్తి-కందుకూరు :పట్టణంలోని తూర్పు యాదవపాలెం సోమవారం కురిసిన వర్షానికి జలమ యమయమైందిభారీగా వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌కు టిడిపి నేతలు వినతిపత్రం అందజేశారు.పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, నాయకులు గుమ్మడి బ్రహ్మయ్య, గుమ్మడి శివ, కాకుమాని మాల్యాద్రి ఉన్నారు.

శేషు స్కూల్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -నెల్లూరు సిటీ :నెల 6,7 తేదీల్లో పాండిచ్చేరిలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన 5వ సౌత్ జోన్ పెంకాక్ సిలాట్ పోటీలలో బుజబుజనెల్లూరు లోని శేషు స్కూల్ విద్యార్థి విజయ శ్రీరామ కష్ణ రెడ్డి బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయికి ఎంపిక య్యాడు. కరస్పాండెంట్ శేషు రామకష్ణ అభి నందించారు. జాతీయ స్థాయిలో బంగారు పతకాన్ని సాధించాలని, తనను ఆదర్శంగా తీసుకుని తమ తమ రంగాలలో విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు.



విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్ రామకృష్ణ


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -గుడ్లూరు

గుడ్లూరు ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష యోజన పథకం కింద మండలంలోని 39 మంది గర్భిణులకు డాక్టర్లు సాయి ప్రియాంక మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న పది మంది గర్భిణులకు సూక్ రోజు ఇంజక్షన్లు వేశారు. మందులు ఉచితంగా అందజేశారు. వైద్య సిబ్బంది ఎఎన్ఎంలు పాల్గొన్నారు.